కుటుంబ కలహాలకు తల్లీ పిల్లలు బలి

● ఇద్దరు పిల్లలను చెరువులోకి తోసి దూకిన తల్లి ● తల్లి, కుమారుడి మృతదేహాలు లభ్యం ● లభించని కుమార్తె ఆచూకీ


మృతులు మంగ, శరత్, ప్రాణాలతో బయటపడిన విఘ్నేష్

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): భార్యా భర్తల కలహాలు ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేశాయి. తల్లీ కుమారుడు మృత్యువు పాలవ్వగా, కుమార్తె జాడ దొరకకుండా పోయింది. భర్తతో కలహాలతో ఓ తల్లి తన ఇద్దరు కుమారులు, కుమార్తెతో గురువారం రాత్రి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్దకు వెళ్లింది. ఓ కుమారుడు, కుమార్తెను ఆ చెరువులోకి తోసింది. తర్వాత తానూ దూకింది. ఈ ఘటనలో తల్లి, కుమారుడు మరణించాడు. వారి మృతదేహాలను పోలీసులు వెలికి తీశారు. అయితే, కుమార్తె జాడ మాత్రం తెలియకుండా పోయింది. ఆమె కోసం పోలీసులు చెరువులో ముమ్మరంగా గాలిస్తున్నారు. ముగ్గురు పిల్లలతో చెరువు వద్దకు చేరిన ఆ తల్లి ఇద్దరిని మాత్రమే చెరువులోకి తోసి ఒక కుమారుడిని ఎందుకు వదిలివేసిందో ఎవరికీ అంతుచిక్కడం లేదు. వివరాల్లోకి వెళితే.. వనస్థలిపురం సంపూర్ణ థియేటర్ కూరగాయల మార్కెట్ దగ్గర నివాసముంటున్న ఒరుసు కుమార్‌కు భార్య మంగ (35), కుమార్తె లావణ్య (15), కుమారులు విఘ్నేష్ (5), శరత్ (7) ఉన్నారు. గురువారం రాత్రి 7.30 గంటల ప్రాంతలో మంగ తన పిల్లలను తీసుకొని బస్సులో ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్దకు చేరుకుంది. పెద్దతూము కింద మెట్ల వెంట కిందికి దిగిన మంగ.. కుమార్తె లావణ్య, కుమారుడు శరత్‌ను నీళ్లలో తోసి తాను కూడా నీళ్లలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కాగా, మరో కుమారుడు విఘ్నేష్ మాత్రం తప్పించుకొని ఒడ్డునే ఉండి ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసులు, మున్సిపల్ సిబ్బంది గాలింపు చేపట్టగా.. మంగ, శరత్‌ల మృతదేహాలు లభ్యమయ్యాయి. లావణ్య ఆచూకీ లభ్యం కాలేదు. కాగా లావణ్య, శరత్, విఘ్నేష్‌లు వనస్థలిపురం ప్రశాంతి విద్యానికేతన్ స్కూల్‌లో చదువుతున్నారు. మూడు, నాలుగు రోజులుగా ఇంట్లో భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని సమాచారం. దాంతో పిల్లలను స్కూలు నుంచి తీసుకువస్తానని చెప్పి మంగ.. వారిని తీసుకొని నేరుగా ఇబ్రహీంపట్నం వచ్చినట్లు బంధువులు తెలిపారు. కాగా కుమార్, మంగలది రెండో వివాహమని అప్పటికే ఇద్దరికీ పెళ్లిళ్లు కాగా.. విడాకులు తీసుకుని పెళ్లి చేసుకున్నారు. కుమార్తె లావణ్య మంగ మొదటి భర్త సంతానమని సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ షాపింగ్‌తో పైలం

● నకిలీ వెబ్‌సైట్లు సృష్టిస్తున్న సైబర్ కేటుగాళ్లు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఈ కామర్స్ సైట్లలో భారీ డిస్కౌంట్‌ల పేరుతో సైబర్ కేటుగాళ్లు కొత్తరకం మోసాలకు తెరతీస్తున్నారు. వినాయక చవితి, దసరా, దీపావళి.. వరుస పండుగల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఆన్‌లైన్ షాపింగ్‌ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఆన్‌లైన్ షాపింగ్‌లకు పెరిగిన అధిక గిరాకీని అవకాశంగా తీసుకుంటున్న కేటుగాళ్లు సైబర్ మోసాలకు తెరతీస్తున్నారు. ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారిని టార్గెట్ చేస్తూ నకిలీ వెబ్‌సైట్లను సృష్టిస్తున్నారు. ఖరీదైన బ్రాండెడ్ దుస్తులు, శారీస్ తక్కువ ధరకే ఇస్తున్నట్లు ప్రకటనలు గుప్పించి.. పండుగ పేరుతో ప్రత్యేక ఆఫర్‌ల పేరిట సోషల్‌మీడియా, ఆన్‌లైన్‌లో పోస్టులు పెడుతున్నారు. వెనుకా ముందు చూడకుండా ఆ నకిలీ వెబ్‌సైట్ల లింక్‌లను క్లిక్ చేస్తున్నారు. ఆర్డర్ బుక్‌చేసి, డబ్బులు చెల్లించిన తర్వాత ఎంతకీ పార్శిల్ చేతికి రాక మోసపోతున్నారు. అనుమానం వచ్చిన కస్టమర్లు అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేస్తే స్విచాఫ్ చేసి ఉంటాయి. ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న సైబర్ ముఠాలు కొన్ని అయితే.. మరికొన్ని సైబర్ ముఠాలు మాత్రం తిరిగి డబ్బులు చెల్లిస్తామంటూ క్యూఆర్ కోడ్‌లు పంపి కస్టమర్ల ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. ఇలా పండుగ ఆఫర్‌ల పేరుతో నకిలీ ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్లు సృష్టిస్తున్న కేటుగాళ్లు అందినంతా దండుకుంటున్నారు.

ప్రతి సైట్‌ను క్లిక్ చేయొద్దు..

ఆన్‌లైన్‌లో కనిపించే ప్రతి ఈ కామర్స్ సైట్‌ను ఓపెన్ చేయొద్దు. నమ్మకమైన ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్లనే ఎంచుకోవాలి. సాధ్యమైనంత వరకు క్యాష్ ఆన్ డెలివరీకి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆన్‌లైన్ షాపింగ్ సమయంలో అడగగానే బ్యాంకు ఖాతాలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ వ్యాలెట్స్ వివరాలు నమోదు చేయొద్దు. ఆ వివరాలన్నీ సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్తాయని గుర్తుంచుకోవాలి. ఒక్కసారి డబ్బులు పోగొట్టుకుంటే తర్వాత తిరిగి రావనే విషయాన్ని కస్టమర్లు తెలుసుకోవాలి.

- సైబర్ క్రైమ్ పోలీసులు

14న హెచ్‌సీయూ గేటు వద్ద ఓబీసీ సత్యాగ్రహ దీక్ష

రాయదుర్గం, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో విస్తృతంగా జరిగిన ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ సమావేశంలో కేంద్ర కార్యనిర్వాహక వర్గం తీసుకున్న నిర్ణయం మేరకు దేశవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల్లో కులగణన కోసం ఓబీసీ సత్యాగ్రహ దీక్షలు చేయనున్నారు. అందులో భాగంగా ఈనెల 14న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద ఓబీసీ సత్యాగ్రహ దీక్షను మొదలుపెడతామని సంఘం నాయకులు తెలిపారు.



నిత్యావసరాలతో తరలిన తెలంగాణ కమ్మ సేవా సంఘాల సమాఖ్య సభ్యులు

ఖమ్మం వరద బాధితులకు నిత్యావసరాలు అందజేత

బాలానగర్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కమ్మ సేవాసంఘాల సమాఖ్య సభ్యులు గురువారం ఖమ్మం వరద ముంపు ప్రాంతాలను సందర్శించారు. ఖమ్మం వదర ముంపు ప్రాంతాలలో సందర్శించి బాధితులకు ఆహార పదార్థాలు, దుప్పట్లను పంపిణీ చేశారు. సమాఖ్య హైదరాబాద్, వరంగల్ శాఖల సభ్యులు ఖమ్మం పద్మావతికాలనీలో వరదబాధితులను పరామర్శించారు. సుమారు వెయ్యి మంది వరద బాధితులకు వారం రోజులకు సరిపడా 16 రకాల నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎప్పుడు ఆపదలో ఉన్నా సత్వరమే కమ్మ సంఘం స్పందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ కమ్మసేవా సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు డొడ్డ రవిశంకర్ ప్రసాద్, ప్రధానకార్యదర్శి ఎస్‌వీ.కృష్ణప్రసాద్, కోశాధికారి రత్నాకర్, ఖమ్మం మేయర్ పునుగోల్లు రజిత, బిక్కసాని నాగేశ్వర్‌రావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హైటెన్షన్ వైర్లు తాకి కాలిన టిప్పర్

గాజులరామారం, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ మట్టిని అన్‌లోడ్ చేస్తుండగా హైటెన్షన్ వైర్లకు తగిలి కాలిపోయింది. గాజులరామారం డివిజన్‌లోని కైసర్‌నగర్ సమీపంలోగల ఆంజనేయస్వామి గుడి దగ్గర రోడ్డు పక్కన టిప్పర్ మట్టిని అన్‌లోడ్ చేస్తుండగా పైన ఉన్న హైటెన్షన్ వైర్లకు తాకడంతో ఒక్కసారిగా టైర్లకు మంటలు అంటుకొన్నాయి. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు, ప్రయాణికులు టిప్పర్ కాలిపోతున్న దృశ్యాలను చిత్రీకరించి వాట్సాప్‌గ్రూపుల్లో పోస్టుచేశారు. జీడిమెట్ల ఫైర్‌సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు.

అశ్వినికాలనీలో వ్యక్తి అదృశ్యం

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగిరాలేదు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొంపెల్లి మున్సిపల్ పరిధిలోని అశ్వినికాలనీకి చెందిన పి.వెంకన్న(53) గతనెల 7న ఉదయం 11గంటలకు ఇంట్లో నుంచి బయటకెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇళ్లలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పేట్‌బషీరాబాద్ పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ స్కూల్‌లో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం

ఓల్డుబోయినపల్లి, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి డివిజన్ అంజయ్యనగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో బుధవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. స్కూల్ ఆవరణలో ఉన్న మీటర్‌బోర్డులో షాట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి పక్క ప్రాంతాలకు వ్యాపించాయి. గమనించిన స్థానికులు వెంటనే కంటోన్మెంట్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను ఆర్పారు. అర్ధరాత్రి కావడంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని కంటోన్మెంట్ అగ్నిమాపక కేంద్రం ఆఫీసర్ రాఘవరెడ్డి తెలిపారు.

వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి


ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులతో మాట్లాడుతున్న జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి


కొండాపూర్‌లో మట్టిగణపతులను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు


మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌వో ముత్తు

గచ్చిబౌలి, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ప్రజలకు, ఉత్సవకమిటీ సభ్యులకు పిలుపు ఇచ్చారు. గురువారం జోనల్ కార్యాలయంలో చందానగర్, పటాన్‌చెరు, యూసఫ్‌గూడ, శేరిలింగంపల్లి సర్కిళ్లలోని ఆయా ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గత సంవత్సరం అరకొర వసతుల మధ్యే చవితి ఉత్సవాలు ముగిశాయని పలువురు సభ్యులు జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జోనల్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఊరేగింపు జరిగే ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లూ చేయాలని అధికారులను ఆదేశించారు. వినాయక నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యం, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఫస్ట్‌ఎయిడ్‌కిట్, అగ్నిమాపకం, విద్యుత్, పారిశుధ్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. రోడ్లపై గుంతలు ఉంటే మరమ్మతులు చేయాలని, రోడ్లకు ఇరువైపులా పారిశుధ్యచర్యలు తీసుకోవాలని, ఫాగింగ్ సక్రమంగా చేయాలని సూచించారు. ఊరేగింపు జరిగే మార్గంలో వీధిదీపాలు సక్రమంగా వెలిగేలా, విగ్రహాలు నీటికొలనులో మునిగేలా నీటిని నింపాలని ఆదేశించారు. వినాయక ఉత్సవం సజావుగా, సురక్షితంగా పరిశుభ్రమైన నీటిలో చేసేలా సౌకర్యాలు కల్పిస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులకు తెలిపారు. ఈ ఏర్పాట్లన్నీ రెండురోజుల్లో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సర్కిళ్ల ఉపకమిషనర్లు, ఆయా విభాగాల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంబీర్‌చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

హైదర్‌నగర్: హైదర్‌నగర్ అంబీర్‌చెరువు వద్ద వినాయక నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన బేబీపాండ్‌ను కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఏఈ రాజీవ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహదేవ్, నాయకులు నిరంజన్‌గౌడ్, సురేష్, వాసు, హనుమంతరావు, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మట్టిగణపతుల పంపిణీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో మట్టిగణపతులను నియోజకవర్గంలోని అన్ని గేటెడ్ కమ్యూనిటీల్లో ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. గురువారం కొండాపూర్‌లో బీజేపీ శేరిలింగంపల్లి కన్వీనర్ రాఘవేంద్రరావు ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహాలను పంపిణీ చేశారు.

14న విశ్వగురు వరల్డ్ రికార్డు గణేశ్ పెయింటింగ్ పోటీలు

దుండిగల్: గణపతి నవరాత్రులను పురస్కరించుకొని బాచుపల్లిలోని సద్గురు ది స్కూల్‌లో ఈనెల 14న విశ్వగురు వరల్డ్ రికార్డు గణేశ్ పెయింటింగ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నట్లు స్కూల్ డైరెక్టర్ సత్యవోలు రాంబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 108 నిమిషాల్లో కాన్వాస్ మీద చిత్రించాలని, మరిన్ని వివరాలకు బాచుపల్లిలోని వీఆర్‌ఎస్ విజ్ఞానస్కూల్‌లో లేదా ఫోన్ 8501800947, 9849490663 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మట్టి గణపతికే జేజేలు!

కేపీహెచ్‌బీకాలనీ: మట్టి గణనాథులకే భక్తజనం జేజేలు కొడుతున్నారు. కూకట్‌పల్లి ప్రాంతంలో ట్రీగార్డు ఫౌండేషన్ పేరుతో 18ఏళ్లుగా దొరరాజు, రోటరీక్లబ్ ఆఫ్ గ్రేటర్ హైదరాబాద్-3150 మాజీ అధ్యక్షుడు మెడెపూడి విజయభాస్కర్ 13 ఏళ్లుగా మట్టి గణపతి ప్రతిమలను పూజించాలని ప్రచారం చేస్తూ భక్తుల్లో చైతన్యం తీసుకొచ్చారు. ఐదేళ్ల క్రితం వరకు కేవలం గేటెడ్ కమ్యూనిటీల్లోనే మట్టి గణనాథులను ప్రతిష్ఠించి పూజలుచేసి, అక్కడే నిమజ్జనంచేసే సంస్కృతి ప్రారంభించారు. రెండేళ్లుగా అపార్ట్‌మెంట్ వాసులు కూడా మట్టి గణపతులు కావాలని వెతుకులాట ప్రారంభించారని మట్టి గణపయ్యలను తయారు చేస్తున్న విజయ్ తెలిపారు. కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో మన అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి గణపతుల కార్యక్రమాన్ని గురువారం కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌వో కొత్తపల్లి ముత్తు ప్రారంభించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని మియాపూర్, గచ్చిబౌలి, అల్లాపూర్, దుండిగల్, నిజాంపేట్, ఫతేనగర్, షాపూర్‌నగర్ ప్రాంతాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ టీచర్లు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులను సన్మానించారు.


కార్యక్రమంలో వృద్ధాశ్రమంలోని రిటైర్డ్ టీచర్లు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు

మియాపూర్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమంలోని కమ్యూనిటీ హాల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. సీఆర్‌ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో ఉన్న రిటైర్డ్ టీచర్లు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు, టైప్‌రైటింగ్ మాస్టర్లను ఘనంగా సన్మానించారు. మహిళా సంక్షేమ కేంద్రం టీచర్లు, వృద్ధాశ్రమ కమిటీ సభ్యులు చెన్నమనేని వెంకటేశ్వరరావు, రాజేందర్‌రావు, తమ్మారెడ్డి తాన్య, చెన్నకేశవరావు పాల్గొన్నారు.

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని సంస్కృతి పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ మెజిషియన్ సామల వేణు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి ఉన్న విలువ మరే వృత్తికి లేదన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మంగళారపు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, డైరెక్టర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ వనిత విభాగం ఆధ్వర్యంలో పలువురికి సన్మానం

అల్లాపూర్: సమాజ సేవే పరమావధిగా ఏర్పడిన వాసవీ క్లబ్ వారి మహిళా విభాగం అయిన 'వనిత' బోరబండ శాఖ ఆధ్వర్యంలో పలువురు అధ్యాపక-విలేకర్లను సత్కరించారు. గురువారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తెలుగు పండితురాలు, ఉపాధ్యాయిని కొత్తపల్లి రాజశ్రీని, ఆంధ్రజ్యోతి విలేకరి అశోక్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో 'వనిత' బోరబండ శాఖ అధ్యక్షురాలు గౌరీలత, ప్రధానకార్యదర్శి అమరజ్యోతి, కోశాధికారి వాసవి, గౌరవసభ్యులు కొమిరిశెట్టి పద్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

దుండిగల్: టీచర్స్‌డేను పురస్కరించుకొని బౌరంపేట్ ప్రాథమిక పాఠశాలలో బీజేపీ నాయకులు పి.సరికృష్ణారెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులు పద్మావతి, రాంరెడ్డి, బసవేశ్వర్‌ను సన్మానించారు.


సూరారం నార్త్‌సిటీ స్కూల్ ప్రిన్సిపాల్ కె.రమాదేవి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ పశంసా పత్రాన్ని ఆమెకు గురువారం మేడ్చల్ కలెక్టర్ గౌతం అందజేశారు. - షాపూర్‌నగర్

విద్యార్థుల ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

నిజాంపేట్: ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా బాచుపల్లి జెడ్‌పీహెచ్‌ఎస్, ప్రైమరీ స్కూల్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులను, విద్యావలంటీర్లను కార్పొరేటర్ పాండు సన్మానించారు. రాజీవ్‌గాంధీనగర్, సాయినగర్, ఇందిరానగర్‌లో పనిచేస్తున్న సుమారు 80 మంది ఉపాధ్యాయులను సన్మానించారు.

ఉపాధ్యాయులకు సత్కారం

ఫతేనగర్: భావితరాలకు ఉపాధ్యాయులే మార్గ దర్శకులని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి అన్నారు. గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా భరత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న ఆయన విగ్రహానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగంతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి కేక్‌నుకట్ చేశారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాణిక్‌రెడ్డి, సూర్యనారాయణ మూర్తి, కృష్ణయ్య, వెంకటేశ్‌యాదవ్, కొండల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బుచ్చిబాబు, వేణు, సంతోష్‌కుమార్, సత్యపాల్‌రెడ్డి, స్వరూపముదిరాజ్, సుకృత్, సాయిరెడ్డి కుమార్, జనార్దన్, యునూష్, రవి, జోజమ్మ, రాజూపటేల్, ఈశ్వర్ పాల్గొన్నారు.

అవినీతి, నిర్లక్ష్యంపై డిస్కం వేటు

● 7 నెలల్లో 19 మంది సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు
● ఆరుగురి సస్పెన్షన్.. కార్పొరేట్ ఆఫీస్‌కు నలుగురి బదిలీ
● 9 మందికి షోకాజ్ నోటీసులు
● జాబితాలో మరికొంతమంది అవినీతి అధికారులు
● త్వరలో వారిపై చర్యలు తీసుకునే అవకాశం..?



హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో అవినీతికి పాల్పడుతూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక దృష్టిసారించింది. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాలతో గడిచిన 7 నెలల్లో 19 మంది ఇంజనీర్లు, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఆరుగురు ఇంజనీర్లను సస్పెండ్ చేయగా, నలుగురిని కార్పొరేట్ ఆఫీస్‌కు బదిలీ చేయగా మరో 9 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. అవినీతి ఆరోపణల జాబితాలో మరికొంతమంది అధికారుల పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో అంతర్గత విచారణ చేసి వారిపై కూడా త్వరలో చర్యలుంటాయనే ప్రచారం జరుగుతోంది. అక్రమార్కుల జాబితాలో కొందరు ఉన్నతాధికారులున్నారని వారిపై లోతుగా విచారణ జరిపి ఆ తర్వాతే చర్యలు తీసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఏ శాఖలో లేని విధంగా ఆదాయం ఎక్కువ తెచ్చిపెట్టే ప్రాంతాలు ఫోకల్, ఆదాయం తక్కువ వచ్చే ప్రాంతాలు నాన్‌ఫోకల్‌గా విభజించారు. ఫోకల్‌ప్రాంతాల్లో పోస్టింగుల కోసం కొందరు అధికారులు ఇప్పటికే రాజకీయనేతలతో పైరవీలు చేయించుకుంటున్నారనే విమర్శలున్నాయి. 15 రోజుల క్రితం సరూర్‌నగర్ సర్కిల్‌లో డీఈటీ ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.18 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఏడాది క్రితం గచ్చిబౌలిలో ఏడీఈ రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.

అవినీతి ఆరోపణలపై ప్రత్యేక దృష్టి

గ్రేటర్‌జోన్ పరిధి శివారు సర్కిళ్లలో పనిచేస్తున్న అధికారులపై ఎక్కువ అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. సైబర్‌సిటీ సర్కిల్‌లో గతంలో ఓ సబ్‌డివిజన్‌ను రెండు సబ్‌డివిజన్లుగా విభజించి మరో ఇద్దరు ఏడీఈలకు పోస్టింగులిచ్చారు. సైబర్‌సిటీ సర్కిల్ కొండాపూర్ డివిజన్‌లోని అల్లాపూర్ సెక్షన్‌లో ఓ లైన్‌మన్‌తో పాటు ఇద్దరు ఆర్టిజన్లను సస్పెండ్ చేశారు. అవినీతి ఆరోపణలు, క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మంగళవారం ఇబ్రహీంబాగ్ ఏడీఈ అంబేడ్కర్‌ను కార్పొరేట్ ఆఫీస్‌కు అటాచ్‌చేయగా, నార్సింగ్ ఏఈ సందీప్ రెడ్డిని సస్పెండ్ చేశారు. మేడ్చల్, హబ్సిగూడ, రాజేంద్రనగర్, సైబర్‌సిటీ, సికింద్రాబాద్ సర్కిళ్ల పరిధిలోని పలు సబ్‌డివిజన్లలో కొంతమంది ఏడీఈలతో పాటు ఏఈలపై పెద్దసంఖ్యలో అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆరోపణలు వచ్చే అధికారులను త్వరలో జరిగే బదిలీల్లో కార్పొరేట్ ఆఫీస్‌తో పాటు ఆఫీస్ పోస్టులకే పరిమితం చేయనున్నారు.

కీలకమైన మెట్రోజోన్ సీఈ పోస్టు ఖాళీ...

గ్రేటర్ విద్యుత్ సరఫరాలో కీలకమైన మెట్రోజోన్ సీఈగా బాధ్యతలు నిర్వహించిన మోహన్‌రెడ్డి ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేశారు. ఆపరేషన్ విభాగంలో కీలకమైన మెట్రోజోన్ సీఈగా ఇప్పటి వరకు ఎవ్వరిని నియమించకపోవడంతో పాలనాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. సీనియర్ స్థాయి ఎస్‌ఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు భారీవర్షాలు, మెట్రోజోన్‌లో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, సమస్యలు పరిష్కరించాలంటే గ్రేటర్‌జోన్‌పై పూర్తిగా అవగాహన కలిగిన సీనియర్ సీఈకి మెట్రోజోన్ సీఈ బాధ్యతలు అప్పగించాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

మందులు అందుబాటులో ఉన్నాయా ?


బస్తీ దవాఖానాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో 'మీ దగ్గర సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయా?' అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ మేరకు కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే గురువారం కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని వ్యాక్సినేషన్ కేంద్రం, బస్తీ దవాఖానాను సందర్శించి, అక్కడ నెలకొన్న సమస్యలతోపాటు రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సరైన సౌకర్యాలు లేక గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని, బస్తీదవాఖానాల్లో టాయిలెట్స్‌తోపాటు ప్రహరీ నిర్మించాలని ఎమ్మెల్యేకు సూచించారు. అనంతరం సీబీసీఐడీ కాలనీలో తాగునీటి సరఫరా గురించి అక్కడ పర్యటించి సమస్యకు పరిష్కరిస్తానని కాలనీవాసులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, రాజేష్ రాయ్, పాతూరి గోపి, సాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీలో అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బందులు లేకుండా కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. గురువారం ఆల్విన్‌కాలనీ డివిజన్ ఉషాముళ్లపూడి రోడ్డులోని ఇండియన్ బ్యాంక్ నుంచి ఎల్లమ్మచెరువు అలుగు వరకు రూ.2కోట్ల అంచనా వ్యయంతో జరుగుతున్న వరదనీటి కాల్వ పనులను, ఎల్లమ్మ చెరువు నుంచి తులసీవనం వరకు జరుగుతున్న సీసీరోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా త్వరితగతిన వరదనీటి కాల్వ పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

దుర్గామాతకు ఎమ్మెల్యే పూజలు

మియాపూర్: చందానగర్ డివిజన్ కేఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్ కాలనీలోని దుర్గామాతకు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, బాలింగ్ గౌతం గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, సందీప్‌రెడ్డి, ట్రస్టు సభ్యులు మనోజ్‌చౌదరి, పరిహరియా చౌదరి, వినోద్‌చౌదరి, హనుమాన్ సోయల్‌చౌదరి పాల్గొన్నారు.

చెత్తను తొలగించిన జడ్‌సీకి కృతజ్ఞతలు


జడ్‌సీకి కృతజ్ఞతలు తెలుపుతున్న భాగ్యనగర్ కాలనీవాసులు

హైదర్‌నగర్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలోని ఓ ప్రైవేట్ స్థలం ఖాళీగా ఉండటంతో చుట్టుపక్కల వ్యాపారులు, కాలనీవాసులు చెత్త పారబోశారు. దీంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారింది. పరిసరాల్లో దుర్వాసన, దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. సమీపంలో మద్యంషాపు కూడా ఉండటంతో మందుబాబులు సీసాలు పారవేస్తున్నారు. దీంతో కాలనీవాసులు జోనల్ కమిషనర్ అపూర్వ్‌చౌహాన్‌కు సామాజిక మాధ్యమం ద్వారా తెలిపారు. స్పందించిన ఆయన సిబ్బందిని పంపించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. దీంతో కాలనీ వాసులు జడ్‌సీకి గురువారం కృతజ్ఞతలు తెలిపారు.

చేపల వేటకెళ్లిన వ్యక్తి చెరువులో గల్లంతు


గల్లంతైన షబీర్

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఫాక్స్‌సాగర్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుత్బుల్లాపూర్ రోడామిస్త్రీనగర్‌కు చెందిన షబీర్ జీడిమెట్ల పారిశ్రామికవాడలో ఫాబ్రికేషన్‌వర్కు చేస్తుంటాడు. ఇతనికి నలుగురు అమ్మాయిలు ఉన్నారు. బుధవారం సాయంత్రం షబీర్ ఫాక్స్‌సాగర్‌లో చేపలు పట్టేందుకు ఇద్దరితో కలసి వెళ్లారు. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోయాడు. అతనితో వెళ్లిన ఇద్దరు సహాయం చేసేందుకు రెండుగంటలపాటు గాలించినా దొరకలేదు. దీంతో ఇంటికి వచ్చి అతని కుటుంబసభ్యులకు చెప్పారు. దీంతో 100కు డయల్ చేయడంతో పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు చెరువు వద్దకు వెళ్లేసరికి రాత్రి కావడంతో వెనుతిరిగారు. 24గంటలు గడచినా షబీర్ ఆచూకీ తెలియలేదని, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో గాలిస్తున్నామని తెలిపారు. పోలీసులు కేసునమోదు చేసుకొన్నట్లు తెలిపారు.

బంగారు ఆభరణాల చోరీల ముఠా అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ హన్మంతరావు

జీడిమెట్ల, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): బంగారు దుకాణాల్లో దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్న కరుడుకట్టిన ఓ దొంగల ముఠాను జగద్గిరిగుట్ట, బాలానగర్ సీసీఎస్ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. ఐదుగురు సభ్యులున్న ముఠాలోని నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రధాన నింధితురాలు పరారీలో ఉన్నారు. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాలానగర్ ఏసీపీ హన్మంతరావు వివరాలను వెల్లడించారు.ఖమ్మం జిల్లా, గోకరాజుపల్లికి చెందిన బొజ్జగాని జ్ఞానమ్మ(60), ఖమ్మం జిల్లా రాయపట్నానికి చెందిన బొజ్జగాని దీనమ్మ(62), బొజ్జగాని నాగేంద్రమ్మ(70), వెంకటరావమ్మ(50), బాలసాని అశోక్(27), డ్రైవర్ బాలసాని వెంకటపతి అలియాస్ నాని ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఈ ముఠా నగరంలోని పలు ప్రాంతాల్లోని బంగారు దుకాణాల్లో చోరీలకు పాల్పడ్డారు. ఇద్దరు చొప్పున విడిపోయి షాపులోకి వెళ్లి బంగారం కొనే ముసుగులో నకిలీ బంగారు వస్తువులను షాపులోపెట్టి అసలు బంగారాన్ని దొంగిలించుకుని పారిపోయారు. దీంతో జగద్గిరిగుట్ట ప్రాంతలోని పలు బంగారు షాపుల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీఫుటేజీ ఆధారంగా వీరిపై నిఘా ఏర్పాటు చేశారు. గురువారం బొజ్జగానిదీనమ్మ, నాగేంద్రమ్మ, వెంకటరావమ్మ, బాలసాని అశోక్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. బొజ్జగాని జ్ఞానమ్మ, వెంకటపతి పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. వీరిపై జగద్గిరిగుట్టలో మూడు కేసులు, జీడిమెట్లలో ఒకటి, రాచకొండపరిధిలోని చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు నమోదయ్యాయి. నిందితులను రిమాండ్‌కు తరలించారు. దీనమ్మపై 11, నాగేంద్రమ్మపై 12, వెంకటరమణమ్మపై 12కేసులు వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో నమోదు అయినట్టు ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో జగద్గిరిగుట్ట సీఐ కె.క్రాంతికుమార్, డీఐ అంజయ్య సీసీఎస్ సీఐ పాల్గొన్నారు.